




కేతు స్మృతి సంచికను ఆవిష్కరిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, మధురాంతకం నరేంద్ర, దాదాహయాత్, తదితరులు

కొత్త ప్రభుత్వంలోనైనా.. యాప్‌ల గోల తగ్గేనా..?

- బోధన కన్నా.. బోధనేతర పనులకే ప్రాధాన్యత
- అడుగంటుతున్న విద్యా లక్ష్యాలు
- కూటమి ప్రభుత్వం సమీక్షించాలి
- ఉపాధ్యాయ సంఘాల విన్నపం

కడప (ఎడ్యుకేషన్), జూలై 28: విద్యాశాఖ, పాఠశాలలు, ఉపాధ్యాయులు బోధనా అనుసంధాన అంశాలు, పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులు బోధన మీద ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థుల్లో అసభ్యనా సామర్థ్యం పెంపొందించాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని అనేక విద్యా కమిషన్‌లు కూడా చెప్పాయి. ఈ దిశగా విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించడం సులభతరం అని వారి అభిప్రాయం. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు బోధన కంటే బోధనేతర యాప్‌ల బాధ్యత ఎక్కువగా అప్పగించింది. దీంతో విద్యాలక్ష్యాలు అడుగంటిపోయాయని చెప్పాలి. దీనిపై అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయులు తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం మారినా పాత విధానాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో ఉపాధ్యాయులు బోధనేతర పనులతో ఇబ్బంది పడుతున్నారు.

యాప్‌ల గోలతో బోధనకు ఆటంకం

బోధనేతర పనులకు అనేక యాప్‌ల గోలే కారణమని తెలుస్తోంది. పాఠశాల ప్రారంభం నుంచి ముగింపు వరకు ఆన్‌లైన్ బోధనేతర సేవలకు ఉపాధ్యాయులు అంకితం కావాల్సి వస్తోంది. ఉదయం 9.30 గంటల్లోపే పాఠశాలల్లోని బాత్‌రూములు పరిశీలించి శుభ్రత, అపరిశుభ్రత మీద ఫోటోలు, ఐఎంఎంఎస్ యాప్ ద్వారా తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అపరిశుభ్రంగా ఉన్నట్లయితే అధికారుల నుంచి ఏం ఆటంకాలు వస్తాయోనని భయంతో ఉపాధ్యాయులు బాత్‌రూముల్లో లెట్రిన్‌లలో పరిశుభ్రం చేయించడంలో నిమగ్నమైన సందర్భాలు కూడా ఉన్నాయి. వెనువెంటనే మొదటి పీరియడ్ తరగతి గదిలోకి వెళ్లిన వెంటనే విద్యార్థి ఆన్‌లైన్ హాజరు అంటూ స్కూలు అటెండెన్స్ యాప్‌ నొక్కుంటే ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ తంతు 9.30గంటల్లోపే పూర్తి చేయాలంటూ కఠినమైన ఆదేశాలు... ఈ యాప్‌తో విద్యార్థుల హాజరు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు విద్యార్థులకు సరఫరా చేయాల్సిన గుడ్లు, చిక్కీలు, రాగి జావ వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. విద్యార్థి గైర్హాజరుకు కారణాలు కూడా ఆన్‌లైన్‌లో చేయాల్సి ఉంటుంది. దీంతో బోధనకు పది నిమిషాల మేర ఆటంకం కలుగుతుందని చెప్పాలి. మధ్యాహ్నం బెల్ కొట్టిన వెంటనే భోజన విరామ సమయాన్ని కూడా ఉపాధ్యాయులు సరైన విధానంలో ఉపయోగించుకోలేకపోతున్నారు. విద్యార్థులకు వడ్డించే తినుబండారాలు ఒక్కొక్కటి ప్రత్యేకంగా ఫోటోలు తీసి శుభ్రత పరిశీలించి యాప్‌లలో అప్‌లోడ్ చేయాల్సి పరిస్థితి. మధ్యాహ్న భోజనం విషయంలో వాస్తవాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తే.. ప్రస్తుత పరిస్థితుల్లో మధ్యాహ్న భోజన పథకం కొనసాగే పరిస్థితులు లేవని తెలుస్తోంది. దీంతో చేసేది లేక ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారు. తనిఖీ చేసిన ఉపాధ్యాయుని ఫోటో కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. దీంతో పాటు ఎంత మంది గుడ్లు, చిక్కీలు తీసుకున్నారనే వివరాలు కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. మధ్యాహ్న భోజనానికి విరామ సమయాన్ని కూడా కేటాయించాల్సిన పరిస్థితి వస్తుంది.

నాడు-నేడు పనుల బాధ్యతలను ఉపాధ్యాయులకే కట్టబెట్టడంతో నిర్మాణ పనుల నాణ్యతకు సంబంధించి పర్యవేక్షించి.. సంబంధిత యాప్‌ల ద్వారా అప్‌లోడ్ చేయించాల్సి వస్తోంది. ఇప్పుడు నాడు-నేడు పేరు మార్పు చేసి.. స్కూలు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంటూ కొత్త పేరుతో సదరు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యాకానుక పేరుతో విద్యార్థులకిచ్చే కిట్లను సైతం మానిటరింగ్ చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై పెట్టి.. ఇందుకు సంబంధించిన వివరాలను యాప్‌ల ద్వారా ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ చేయకుంటే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. బయోమెట్రిక్ అంటూ స్కూలు అటెండెన్స్ యాప్ ద్వారా ఉపాధ్యాయుల హాజరు ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. అప్పుడప్పుడు వీటి మొరాయింపులతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ఈ బాధల నుంచి కొత్త ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఉపశమనం కల్పించి బోధనకు మాత్రమే పరిమితం చేసే విధానాన్ని తీసుకురావాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.





యాప్‌ల భారం తగ్గించండి..



బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలి. యాప్‌ల నిర్వహణ కోసం ప్రత్యేక ఎడ్యుకేషన్ అసిస్టెంటును నియమించి.. బోధనేతర కార్యక్రమాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మాతృశాఖకు పంపాలి. నాడు-నేడు పనుల నాణ్యతకు ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరి కాదు. ఉపాధ్యాయులను నాన్ ఒకేషనల్ డిపార్ట్‌మెంటుగా గుర్తించాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు

బోధనేతర యాప్‌ల నుంచి విముక్తి కల్పించాలి..



బోధనేతర యాప్‌ల నిర్వహణ నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలి. ఉదయం పాఠశాల ప్రారంభం నుంచి ముగిసే వరకు వివిధ రకాల యాప్‌ల నిర్వహణతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతూ మానసిక క్షోభకు గురవుతున్నారు. అన్ని రకాల యాప్‌ల నిర్వహణ వల్ల విద్యార్థులకందాల్సిన బోధన సమయం తగ్గిపోవడంతో మెరుగైన అభ్యసనా ఫలితలు విద్యార్థుల నుంచి ఆశించలేం. ప్రభుత్వం తక్షణమే స్పందించి బోధనేతర యాప్‌ల నుంచి విముక్తి కల్పించాలి.

- ఎస్.రామాంజనేయులు, ఎస్టీయూఎఫ్ రాష్ట్రఅధ్యక్షులు

యాప్‌ల వినియోగంపై సమీక్షించాలి..



విద్యాశాఖలో ప్రస్తుతం అమలవుతున్న యాప్‌ల వినియోగంపై ప్రభుత్వం తగు సమీక్ష చేయాలి. అవసరమైన మేరకు మాత్రమే యాప్‌లను వాడాలి. ప్రధానంగా బాత్‌రూములు, టాయిలెట్లు, మధ్యాహ్న భోజనంలోని పదార్థాలు తదితర ఫొటోలను పంపడాన్ని తీసివేయాలి. స్కూలు అటెండెన్స్ యాప్‌లో విద్యార్థులకు సంబంధించిన విధానం మార్చాలి. ఇప్పుడు యాప్‌ల కన్నా ఇబ్బందికరంగా మారిన ఆన్‌లైన్‌లో సమాచార సేకరణ విధానంలో తగిన మార్పులు చేయాలి. ఏఐ కాలంలో సాంకేతిక పరిజ్ఞానం వాడకం తప్పనిసరి అయినప్పటికీ వాటిని వీలైనంత తగ్గించి అవసరమైన మేరకు మాత్రమే వాడితే మంచిది.

- కె.సురేష్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

యాప్‌లు ఇలా...

- **అటెండెన్స్ యాప్**

ఈ యాప్‌లో ఉదయం ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు వేయాలి. సిగ్నల్ సరిగా లేకపోతే హాజరు సమయానికి పడదు. గుండు గీయించుకున్నా, తల వెంట్రుకలకు రంగు వేసుకున్నా హాజరు నమోదు కాదు. విద్యార్థుల హాజరు నమోదు చేయడానికి పదినిమిషాలు టైం తీసుకుంటుంది.

ఐఎంఎంఎస్

ఈ యాప్ పాఠశాలకు వచ్చిన వెంటనే మరుగుదొడ్ల శుభ్రతకు సంబంధించి వాటి ఫోటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. మధ్యాహ్నభోజనం చేసే సమయంలో వాటి ఫోటోలు తీసి శుభ్రత పరిశీలించి వాటిని అప్‌లోడ్ చేయాలి. గుడ్లు సరఫరా చేసినప్పుడు వాటి ఫొటోలు చిక్కీల ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాలి.

- **స్టూడెంట్ కిట్స్**

ఈ యాప్ స్టూడెంట్లకు ఇచ్చిన కిట్లకు సంబంధించి తల్లిదండ్రులతో బయోమెట్రిక్ వేయించుకోవాలి. విద్యార్థుల షూకొలతలు వేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.

- **దీక్షా యాప్**

ఈ యాప్‌లో విద్యాప్రవేశాలకు సంబంధించిన సమాచారం. ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. సీనియర్ ఉపాధ్యాయులకు ఇది చాలా కష్టతరమైన విషయం. దీంతో పాటు తిర్కి యాప్, స్విస్ట్ చార్ట్, ప్రషక్ట్, టీచ్ యాప్, స్కూలు పర్‌ఫార్మెన్స్ ఎవల్యూషన్ టూల్ యాప్, సిర్ యాప్, స్కూలు ఇన్‌స్ట్రక్టర్ ఇన్‌ఫ్రూవ్‌మెంటు యాప్, అకడమిక్ మానిటరింగ్ యాప్ తదితర యాప్‌లతో బోధనా సమయం తగ్గి విద్య కుంటుపడే అవకాశం ఉంది.

బహుముఖ ప్రజ్ఞాశాలి కేతు

- కేతు స్మృతి సంచిక ఆవిష్కరణలో మధురాంతకం నరేంద్ర

కడప (కల్చరల్), జూలై 28: సంపాదకుడిగా, కథకుడిగా, విమర్శకుడిగా, విద్యావేత్తగా కేతు విశ్వనాథరెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రసిద్ధ కథా నవలా రచయిత మధురాంతకం నరేంద్ర అన్నారు. రాయలసీమ ప్రాతినిధ్య కథకుడు కేతు విశ్వనాథరెడ్డి 85వ జయంతిని పురస్కరించుకుని కథారచయిత పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి నిర్వహణలో ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో కేతు స్మృతి సంచిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రసిద్ధ రచయిత దాదాహయాత్ అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా అరసం జాతీయ అధ్యక్షుడు పెనుకొండ లక్ష్మీనారాయణ కేతు స్మృతి సంచిక కేతు తలపులలో అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రధాన ప్రసంగాన్ని మధురాంతకం నరేంద్ర చేశారు. రాయలసీమ ప్రాతినిధ్య కథకుడిగా ఈ ప్రాంతపు ఆర్థిక, సాంఘిక, సంక్లిష్టతలను, సంక్షోభాలను, వాటి మాటున దాగిన మానవీయ కోణాలను ప్రతిభావంతంగా చిత్రీకరించిన కథకు నిలువెత్తు రూపం కేతు అన్నారు. సాహిత్యమే జీవితంగా కేతు బతికారన్నారు. కేతులో ఇద్దరు మనుషులున్నారని, భిన్నమైనవారు కాదు, పరిపూర్ణమైన వారు కాదు, అయినా భిన్నంగా కనిపిస్తారన్నారు. ఇలాంటి రచయితలు చాలా అరుదుగా ఉంటారన్నారు. ఆయన నమ్మిన విషయాన్ని ఎదుటివారికి నొప్పి లేకుండా చెప్పడంలో చాలా దిట్ట అన్నారు. ప్రధానంగా కేతులో రాయలసీమ తాలూకా బైరాగి లక్షణాలుండేవన్నారు. భౌతికంగా కేతు మన మధ్య లేకపోయినా ఆయన రాసిన కథలు మనలను వెంటాడుతూనే ఉంటాయన్నారు. కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ మాట్లాడుతూ కేతు రాసిన కథల్లో రాయలసీమ కరువు, స్త్రీ పక్షపాతమూ ఉంటుందని ఆయన కథలను ఉదహరించారు. అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ తాను కథలు రాసిన తొలినాళ్ళలో తన కథల్లో విధి పాత్రను తగ్గించుకోవాలని మంచి సూచన చేశారన్నారు. కథా రచయిత సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కేతు, సింగమనేనిలు తన కథా రచనకు ముందు వెనుక ఉండి నడిపించారని అన్నారు. ఇంకా విశ్రాంత చరిత్ర అధ్యాపకులు వై.ప్రభాకర్‌రెడ్డి, అరసం జిల్లా అధ్యక్షుడు ఎన్.ఈశ్వర్‌రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపకులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, సాహితీవేత్తలు సంజీవమ్మ, టక్కోలు మాచిరెడ్డి, సుంకోజి దేవేంద్ర, కేతు విశ్వనాథరెడ్డి కుమార్తె శిరీష, సీనియర్ పాత్రికేయుడు రమణయ్య, సీపీఐ రాష్ట్ర నాయకులు జి.ఓబులేసు, నాయకులు సుబ్రమణ్యం, ఆర్‌సీపీ నాయకులు ఎస్.రవిశంకర్‌రెడ్డితో పాటు పలువురు రచయితలు, పాల్గొన్నారు.

మతతత్వ రాజకీయాల పట్టు సడలింది

- సీపీయం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

బద్వేలు రూరల్, జూలై 28: మతతత్వ రాజకీయాల పట్టు సడలిందని, పాలకుల మాటలు చేతలకు పొంతన ఉండడం లేదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏగఫూర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పోరుమామిళ్ల రోడ్డులో ఉన్న శ్రీనివాస కల్యాణ మండపంలో నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశాలకు ముఖ్యఅతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలో పాలకుల మాటలు, చేతలకు పొంతన లేకపోవడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందన్నారు. బీజేపీ ప్రచారంలో ఈ సారి 400 సీట్లు గెలుచుకోబోతున్నామని ఎన్నికల ప్రచారం మొదలు పెట్టిందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అండదండలతో మతతత్వ పొదిలో ఉన్న అన్ని అస్త్రాలు వాడి 400 సీట్ల లక్ష్యాలు సాధించుకునేందుకు శతవిధాల ప్రయత్నించారన్నారు. మొదటి రెండు దశల పోలింగ్ సరళిని గమనించాక బీజేపీ వికసిత భారత్ కొత్త నినాదం తెరపైకి తేవడం జరిగిందన్నారు. మూడో దఫా కేంద్రంలో అధికారంలోకి వచ్చినా బీజేపీ పట్టు సడలిందని, మిత్రపక్షాలైన బాబు నితీష్‌ల అండతో అధికారంలోకి వచ్చారన్నారు. సీపీయం జిల్లా కార్యవర్గసభ్యుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25వేల ప్రభుత్వ ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసే విధంగా ఉండాలన్నారు. రాయలసీమలో వలసలు, కరువు నివారణకు ఏకైక మార్గం కడప ఉక్కు పరిశ్రమనే అని.. ఉక్కు పరిశ్రమ నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం కేంద్రప్రభుత్వం సహకారం కోరాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మనోహర్, సీపీయం నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

సైబర్ నేరగాళ్లు పొంచి ఉన్నారు..

- యూపీఐ చెల్లింపుల్లో.. తస్మాత్ జాగ్రత్త
- ఫేక్ ఐడీ పంపించి.. డబ్బులు కొట్టేసే ప్రమాదం
- జిల్లాలో 19 నెలల వ్యవధిలో 1804 పైగానే ఫిర్యాదులు



కడప (క్రైం), జూలై 28: ప్రస్తుతం ప్రతి ఒక్కరూ యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్) ద్వారా డబ్బులు చెల్లింపులు చేస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న సైబర్ నేరగాళ్ల యూపీఐ ద్వారా ఫేక్ ఐడీ పంపిస్తూ.. డబ్బులు దోచుకుంటున్నారు. నేడు చిన్న చిన్న షాపుల నుంచి పెద్ద దుకాణాల వరకు ఈ యూపీఐ స్కానింగ్ విధానం వినియోగిస్తున్నారు. జనాలు కూడా ఈ విధానంలో డబ్బులు చెల్లిస్తూ వస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకుని సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతూ వస్తున్నారు. ఈ తరహా మోసాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. కడప జిల్లాలో 19 నెలల్లో దాదాపు 1804 ఫిర్యాదులు వచ్చాయి అంటే.. ఈ తరహా బాధితులు ఏ స్థాయిలో ఉన్నారో ఇట్టే అర్థమవుతుంది. యూపీఐ వినియోగించే టప్పుడు అప్రమత్తంగా లేకుంటే సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కినట్లే.

నకిలీ యూపీఐ రిక్వెస్ట్‌లతో..

కొందరు సైబర్ నేరగాళ్ల ముందుగా కొంతమంది యూపీఐ అకౌంటులోకి డబ్బు పంపిస్తారు. ఆ తరువాత వారికి ఫోను చేసి పొరపాటున నగదు పంపించామని.. ఆ డబ్బులు అత్యవసరమని తిరిగి పంపండంటూ ప్రాధేయపడతారు. వారి మాటలు నమ్మి ఒకే చెబితే, రీఫండ్ పేరుతో మరో లింకు పంపిస్తారు. సరేలే అని దాన్ని స్కాన్ చేస్తే వెంటనే స్కామర్లు బాధితుల ఫోన్‌ను తమ ఆధీనంలోకి తెచ్చుకుని వాలెట్ బ్యాంకు ఖాతాలోని నగదు దోచేస్తారు.

జాగ్రత్తలు తీసుకుంటే సరి..

యూపీఐ లావాదేవీలు నిజానికి చాలా భద్రమైనవి. ఓటీపీ, యూపీఐ వివరాలు చెప్పనంత వరకు స్కామర్లు ఏమీ చేయలేరు. యూపీఐ మోసాల బారిన పడకుండా ఉండాలంటే యూపీఐ ఐడీని ప్రతి నెలా మార్చుకుంటూ ఉండాలి. ఎవరైనా పొరపాటున నగదు పంపించి వెంటనే ఆ డబ్బులు తిరిగి పంపించాలంటూ లింకులు పంపిస్తే మాత్రం ఎట్టి పరిస్థితు ల్లోనూ ఆ లింకులను క్లిక్ చేయకూడదు. అవసరమైతే ఆ వ్యక్తి ఫోను నెంబరు ద్వారా డబ్బులు పంపించవచ్చు. ఇలాంటి ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా.. ఎలాంటి స్కామ్‌లు జరుగుతున్నాయో ముందే తెలుసుకుని.. వాటిని గుర్తించడంతో పాటు సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.



19 నెలల్లో 1804 ఫిర్యాదులు

గత ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు అంటే 19 నెలల్లో 1804 ఫిర్యాదులు పోలీసులకు అందాయి. అంటే.. యూపీఐ ద్వారా ఎంత మంది మోసపోతున్నారో ఇట్టే అర్థమవుతుంది. కొంత మంది రూ.వేల నుంచి లక్షల్లో డబ్బులు పోగొట్టుకుంటున్నారు. అయితే బయటికి చెబితే తమ పరువు ఎక్కడ పోతుందోనని చాలా మంది డబ్బులు పోగొట్టుకున్నా.. తమలో తాము బాధపడుతూ మిన్నకుండిపోతున్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు ఎక్కడో ఉంటూ ఈ సిస్టమ్‌ను ఆపరేట్ చేస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. ప్రజలు ఆన్‌లైన్ పేమెంట్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వడివడిగా... ఖరీఫ్ సాగు

- రోజు రోజుకూ పెరుగుతున్న సాగు
- 12262 హెక్టార్లలో పంటలు
- వ్యవసాయ పనుల్లో.. అన్నదాతలు

కడప(రూరల్), జూలై 28: జిల్లాలో 2024 ఖరీఫ్ సాగు గత ఏడాది కంటే కాస్తా వేగంగా సాగుతోంది. ఈ ఏడాది ఆశించిన వర్షాలు పడుతుండడంతో రోజురోజుకు సాగు విస్తీర్ణం పెరుగుతోంది. 2024 జూన్‌లో 68.2 మిల్లీమీటర్ల వర్షపాతం అవసరం కాగా 138.4 మిల్లీ మీటర్ల అధిక వర్షపాతం నమోదైంది. జూన్ నెలలో ఆశించిన మేర వర్షపాతం నమోదు కావడంతో ముమ్మరంగా రైతులు ఎరువాక సాగుకు నడుం బిగించారు. అలాగే జూలై నెలలో 96.7 మిల్లీమీటర్ల వర్షపాతం అవసరం కాగా.. ఇప్పటి వరకు 51.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో ప్రతి దశలోను పంటసాగు గణనీయంగా పెరుగుతోంది. వెరసి 2024 ఖరీఫ్‌లో జిల్లాలో మొత్తం 75,189 హెక్టార్లలో పంటల సాగు లక్ష్యం కాగా.. జూలై 25 నాటికి 12262 హెక్టార్లలో సాగుకు నోచుకున్నాయి. దీంతో పంటల సాగు 16.31 శాతం చేరుకుంది. ఇందులో పత్తి పంట 24086 హెక్టార్లకు గాను 4208 హెక్టార్లలో, వేరుశనగ 5971 హెక్టార్లకు 1384 హెక్టార్లలో, మినపపంట 2642 హెక్టార్లకు గాను 2492 హెక్టార్లలో, వరిపంట 31171 హెక్టార్లకు 2226 హెక్టార్లలో సాగుకు నోచుకున్నాయి. ఇలా రోజురోజుకు సాగు పరుగులు పెడుతోంది.

లక్ష్యానికి మించి మినుపపంట

జిల్లాలో మినుప పంట లక్ష్యానికి మించి సాగుకు నోచుకోనుంది. 2024 ఖరీఫ్‌లో 2642 హెక్టార్లు లక్ష్యం కాగా జూలై 25 నాటికే 2492 హెక్టార్లలో పంట సాగైంది. ఆశించిన మేర వర్షాలు పడుతుండడంతో పంటసాగుపై రైతులు ఆసక్తిని కనబరుస్తున్నారు. వేరుశనగ, పత్తిపంట సాగుకు అనువైన వర్షాలు పడడంతో రైతులు పంటల సాగుకు పరుగులు పెడుతున్నారు. ఇప్పటికే పత్తిపంట సాగు 4208 హెక్టార్లలో, వేరుశనగ 1384 హెక్టార్లలో సాగైంది.

వ్యవసాయరంగానికి పూర్వ వైభవం

గత వైసీపీ ప్రభుత్వంలో డీలా పడ్డ వ్యవసాయరంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు టీడీపీ ప్రభుత్వం తగు చర్యలకు ఉపక్రమించింది. ఈమేరకు 2024 ఖరీఫ్ సాగుకు రైతన్నలకు వెన్నుదన్నుగా నిలిచేందుకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్రపరికరాలు తదితర వాటిని సకాలంలో అందించేందుకు అధికారులను సమాయత్తం చేస్తున్నారు. నూతన టీడీపీ ప్రభుత్వం నుంచి ఒక పక్క



ఖరీఫ్ సాగుకు అవసరమైన అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తుండగా మరోపక్క అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందిస్తూ అనువైన పంటల సాగుకు చర్యలను చేపడుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో సోదాలు

- బెంగళూరు నుంచి మదనపల్లెకు చేరుకున్న నవాజ్‌బాషా
- డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు

మదనపల్లె టౌన్, జూలై 28: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం ఘటన జరిగి వారం రోజులు కావస్తుండటంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓవైపు ప్రధాన అనుమానితుడు రైస్‌మిల్లు మాధవరెడ్డి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు వేట సాగిస్తుండగా, మరో రెండు బృందాలు మాధవరెడ్డి సన్నిహితుల ఇళ్లలో సోదాలు చేసి, ఇద్దరు వైసీపీ ముఖ్య నాయకులను విచారించారు. ఈ క్రమంలో ఆదివారం స్థానిక సీటీఎం రోడ్డులో నివాసమున్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంటి వద్దకు ఉదయమే పోలీసులు చేరుకున్నారు. ఆయన ఇంటిలో లేకపోవడంతో ఫోన్ చేయడంతో తాను బెంగళూరులో ఉన్నానని సాయంత్రం కల్లా మదనపల్లెకు వస్తానని నవాజ్‌బాషా చెప్పారు. ఎట్టకేలకు సాయంత్రం 5 గంటలకు నవాజ్‌బాషా మదనపల్లెకు రావడంతో పాటు తన ఇంట్లోకి పోలీసులను అనుమతించారు. డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో సీఐలు మల్లికార్జునగుప్తా, సద్గురుడు, టి.మధు, పోలీసు సిబ్బంది నవాజ్‌బాషా ఇంటిలో సోదాలు చేశారు. వీఆర్వోల సమక్షంలో ఇంట్లోని అన్ని గదులు, అల్మారాలు, బీరువాలు తనిఖీ చేశారు. ఈ సోదాల్లో నవాజ్‌బాషా ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్స్ కనపడ్డాయని సమాచారం. ఈ డాక్యుమెంట్లలో ఏవైనా జాయింట్ ప్రాపర్టీస్ ఉన్నాయా, మాధవరెడ్డికి సంబంధించి ఏవైనా లావాదేవీలు నిర్వహించారా అనే దిశలో కూడా పోలీసులు సోదా చేశారు. కాగా నవాజ్‌బాషా తరఫున న్యాయవాదిని నియమించుకోగా న్యాయవాది ఎదుటే పోలీసులు సోదాలు చేశారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న రికార్డుల వివరాలన్నింటిని అక్కడే నమోదు చేసి, వీఆర్వోల సమక్షంలో పంచానామా చేసి నమోదు చేసిన వివరాలను పోలీసులు తీసుకెళ్లారు.



మదనపల్లెలో మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో సోదాలు నిర్వహిస్తుండగా బయట బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ఇంట్లో పోలీసుల సోదాలు

తంబళ్లపల్లె జూలై 28: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల కాల్చివేత ఘటన నేపథ్యంలో పోలీసుల విచారణ జోరందుకుంటోంది. కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమానం ఉన్న ప్రతిచోట పోలీసులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేస్తూ ఆధారాలు, వివరాలు సేకరిస్తున్నారు. శనివారం రాత్రి తంబళ్లపల్లెలోని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఇంట్లో మదనపల్లె పోలీసులు సోదాలు చేశారు. తంబళ్లపల్లె ఎస్ఐ శివకుమార్ స్థానిక రెవెన్యూ సిబ్బంది (వీఆర్‌ఏలు)తో కలిసి మదనపల్లె నుంచి వచ్చిన తనిఖీ బృందం ఎమ్మెల్యే ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అదే సమయంలో ఇంట్లో ఉన్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ తనిఖీలకు సహకరించినట్లు తెలిసింది. సుమారు అరగంట పాటు ఇంటిని మొత్తం జల్లెడ పట్టగా ఎటువంటి రికార్డులు లభించలేదని ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎమ్మెల్యే ఇంటివద్ద పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మొబైల్ షాపులో చోరీ...

బద్వేలు టౌన్, జూలై 28: స్థానిక మైదుకూరు రోడ్డులోని మొబైల్ మార్ట్‌లో ఆదివారం 3 మొబైల్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. దుకాణంలోకి కస్టమర్లుగా వచ్చిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు తమ వద్ద ఉన్న మొబైల్‌ను షాపు యజమానికి చూపించి మాటల్లో పెట్టగా, మరో వ్యక్తి మూడు సెల్‌ఫోన్లను చోరీ చేశాడు. వారు వెళ్లిన అనంతరం మూడు మొబైల్స్ కన్పించకపోవడంతో సీసీ ఫుటేజీని పరిశీలించగా, చోరీ జరిగినట్లు తేలిందది. దీంతో బాధితుడు బద్వేలు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వీరపునాయునిపల్లె, జూలై 28: మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమదంలో ఇరువురికి గాయాలయ్యాయి. ఉమ్మారెడ్డిపల్లెకు చెందిన లలిత, మహేశ్వర్‌రెడ్డి ద్విచక్రవాహనంలో నందిమండలం సమీపంలోని కొండగంగమ్మ వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా వీరపునాయునిపల్లె వద్ద వెనుకనుచి కారు ఢీకొంది. దీంతో బైకు వెనుక కూర్చున లలిత ఎగిరిపడడంతో తలకు గాయాలయ్యాయి. మహేశ్వర్‌రెడ్డి కూడా గాయాలపాలవడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో పక్కనే ఉన్న బంకు దెబ్బతినింది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

● బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు,వెండి వస్తువులను చూపుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్

వేంపల్లె, జూలై 28: స్థానిక బండల ఉత్తన్న వీధిలోని ఓ ఇంట్లో బంగారు, వెండి నగలు చోరీ చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారంపులివెందుల డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐ చాంద్‌బాషా విలేకరులకు వివరాలను వెల్లడించారు. బండల ఉత్తన్న వీధికి చెందిన సయ్యద్ నూర్జహాన్ తన కొడుకు, కోడలుకు చెందిన బంగారు, వెండి వస్తువులు బీరువాలో దాచిఉంచింది. గత నెల 19న కడపకు వెళ్లి జూన్ 26న ఇంటికి తిరిగివచ్చిన ఆమె బంగారు నగదు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించింది. ఈ మేరకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ చాంద్‌బాషా, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ వర్మ, కానిస్టేబుళ్లు కిరణ్, మహేష్ నిందితులను గాలించి ఆదివారం అరెస్టు చేశారు. సుమారు రూ.5లక్షల విలువైన బంగారు, వెండి నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఎర్రచందనం అక్రమరవాణా కేసులో ఒకరి అరెస్టు



నిందితుడితోపాటు కారును చూపుతున్న పోలీసులు

గోపవరం, జూలై 28 : ఈ నెల 23న పీపీకుంట సమీపంలో రేగిమానుకుంట వద్ద 59 ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకున్న కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు పిల్లిబోయిన వెంకటరమణను శని వారం రాత్రి అరెస్టు చేసినట్లు సీఐ విక్రమసింహ, బద్వే లు రూరల్ ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 27 రాత్రి 8 గంటల సమయంలో నిందితుడు కారులో నెల్లూరు వైపు పారిపోతుండగా అరెస్టు చేసి, అతడు నేరంలో ఉపయోగించిన కారును, ఒక మొబైల్‌ను అతడి నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న ఇంకా కొంత మంది నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

ఓబులవారిపల్లె, జూలై 28: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య జ్యోతి కథనం మేరకు మంగంపేట కాపుపల్లె ఎస్టీ కాలనీకి చెందిన వెలుగు రాజా అలియాస్ రాజేంద్ర ఆదివారం తెల్లవారుజామున వేటకు వెళుతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంట్లోంచి బయలుదేరాడు. అయితే, అతను ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో గాలించగా కొర్లకుంట గ్రామం చలంపాలేనికి వెళ్లేదారిలో ఏపీఎండీసీ డంప్ కింద అతని మృతదేహం లభించింది. కాగా, వేటకు వెళ్లిన సమయంలో ఎక్కడైనా పొలాలకు వేసిన విద్యుత్ కంచె తగిలి మృతి చెందడంతో మృతదేహాన్ని అక్కడికి తెచ్చి పడేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి రావలసి ఉంది

ప్రభుత్వం మారినా తీరు మారని రిమ్స్ అధికారులు



ప్రభుత్వం మారినా పాత ప్రభుత్వం నాటి చిత్రాలతోనే ఉన్న ఆరోగ్యశ్రీ కేబిన్

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 28 : ప్రభుత్వం మారి రెండు నెలలు గడుస్తున్నా కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఇంకా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మర్చిపోలేకపోతున్నారు. నిత్యం వేలాది మంది ప్రజలు వచ్చే ఓపీ విభాగంలో ఆరోగ్యశ్రీ కేబిన్‌పై జగన్ ఫొటో ఇప్పటికీ బాహాటంగా ప్రదర్శించారు. ఆసుపత్రికి సంబంధించిన ప్రతి అధికారి, ఉద్యోగి, సిబ్బంది, సెక్యూరిటీ, శానిటేషన్, నర్సు లు, వైద్యులు, వైద్యేతర సిబ్బంది ఉన్నతాధికారులు తిరిగే ప్రదేశం అయినప్పటికీ ఇది మా బాధ్యత కాదు అనుకున్నారో ఏమో. ఎవరికీ పట్టనట్లు వ్యవహరించారో తెలియడంలేదు మరి. ఏదిఏమైనా ఆసుపత్రి సిబ్బంది ఏ మాత్రం బాధ్యత లేకుండా వ్యవహరించడంపై రోగులు చర్చించుకుంటున్నారు.

ఆగిన 'మీ సేవ'

● సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, రైతుల ఇక్కట్లు

● ఎన్‌ఓసీలపై జాప్యం చేస్తున్న కంపెనీ నిర్వాహకులు



మీసేవ కేంద్రం

పులివెందుల టౌన్, జూలై 28: మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు 20 రోజుల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆశించిన మేరకు సేవలు అందకపోతుండడంతో వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. రైతులు బ్యాంకు రుణాల రెన్యూవల్‌కు అవసరమైన 1బి, అడంగల్ పత్రాలకోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటర్, ఇంజనీరింగ్ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లలో వివిధ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అక్కడి నుంచి వీఆర్వో, ఆర్‌ఐ, తహసీల్దార్, ఆర్డీఓ లాగిన్ వరకు వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో ఉన్న గడువు కాస్త పూర్తవుతుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ బిల్లులు, ఇంటి పన్ను, నీటిపన్ను, చెల్లించలేని పరిస్థితి ఉండడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏపీఆన్‌లైన్ సెంటర్లు 238, అర్బన్ ఫ్రాంచైజీలు 50 ఉన్నాయి. వీటికి ఏపీ ఆన్‌లైన్, రామ్‌ఇన్ఫో సర్వీసులు అందిస్తున్నాయి. ఈ రెండు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి బకాయిలు పడినట్లు తెలిసింది. దీంతో మూడు వారాల కిందట ప్రభుత్వ మీసేవ కేంద్రాలకు, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలకు సర్వీసులను నిలిపివేసింది. ఆయా సంస్థలు బకాయిలు ఏమీలేనట్లు ఎన్‌ఓసీలు తెచ్చుకుంటేనే సర్వీసులు పునరుద్ధరిస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే ఆయా సంస్థలు ఎన్‌ఓసీ తెచ్చుకోవడంలో తీవ్ర జాప్యం చేస్తుండడంతో, మీసేవ కేంద్రాలో సేవలు నిలిచాయి. ఒక్కో కేంద్రంలో సగటున 350 సర్వీసులను ప్రజలు వినియోగించుకుంటారు. 1బి, అడంగల్, మ్యుటేషన్, అడంగల్ కరెక్షన్, నీటిపన్ను, విద్యుత్, ఆస్తి పన్ను, ఆర్డీఏ, రిజిస్ట్రేషన్, కుల, ఆదాయ, బర్త్, డెత్ తదితర సేవల కోసం వీటికే ఎక్కువ వెళ్తుంటారు. అక్కడ సర్వీస్ చార్జీలు చెల్లించుకుని నిర్ణీత తేదీన సర్టిఫికెట్లను కేంద్రాల నిర్వాహకులు అందిస్తుంటారు. కుల ధ్రువీకరణ, ఆదాయం వంటి సర్టిఫికెట్లను విద్యార్థులకు అడ్మిషన్ల సమయంలో విద్యాసంస్థలు కోరుతుంటాయి. దీంతో అంతా మీ సేవ కేంద్రాల వైపు చూస్తుంటారు. ఒక్కసారి కులధ్రువీకరణ పత్రం ఇచ్చిన తర్వాత మళ్లీ తాజాగా తీసుకు రావాలని కోరవద్దని ప్రభుత్వం ఆదేశించినా, వివిధ శాఖలు వాటిని బేఖాతర్ చేస్తున్నాయి.

అయితే విద్యార్థులు అవసరాలను సొమ్ము చేసుకునేందుకు కొందరు రెవెన్యూ అధికారులు మైగ్రేషన్ సర్టిఫికెట్ తీసు కురావాలని చెబుతున్నారు. ఆ సర్టిఫికెట్ తెచ్చుకోలేనివారు, దళారులకు డబ్బు సమర్పించుకుంటేనే కులధ్రువీకరణ పత్రం అందుతుంది. రోజూ మీసేవ ద్వారా లక్షల రూపాయల ఆదాయం ప్రభుత్వానికి సమకూరు తుంది. 20 రోజులుగా సర్వీసులు నిలిచిపోవడంతో ఆ మేరకు ప్రభుత్వా నికి నష్టం జరిగింది. తక్షణం సర్వీసులను పునరుద్ధరించాలని మీసేవ నిర్వాహకులు, ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం: కలెక్టర్

● ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి


జమ్మలమడుగు, జూలై 28: ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాల ఆవరణంలో దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం పేదలకోసం ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టిందన్నారు. పెన్నానదిలో ఇసుకను వెలికితీసే ఖర్చులు మాత్రమే చెల్లించాలన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ ఆరోగ్యం చాలా ప్రధానమైందన్నారు. కడపజిల్లాలో పోలీసుల పనితీరు విమర్శలు రాకూడదన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ చక్కటి పథకమన్నారు. ప్రతినెల రెండవ శనివారం ఇదే ప్రాంగణంలో మెడికల్ క్యాంపు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, కమిషనర్ ప్రమోద్‌కుమార్, కూటమి నాయకులు దేవగుడి యూత్ నాగేశ్వరరెడ్డి, డాక్టర్ రాజేష్‌రెడ్డి, గోనా పురుషోత్తంరెడ్డి, నాగేంద్రయాదవ్, బీర్రు సంతోష్, నవనీశ్వరరెడ్డి, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ సూచించారు. ఆదివారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ తదితర శాఖలకు సంబంధించిన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, పంచాయతీరాజ్ అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు వారి వారి శాఖలకు సంబంధించిన సమస్యలను వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, ఆస్పత్రుల్లో నీరు, విద్యుత్ తదితర సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. కాగా, తనకు పెన్షన్ ఇప్పించాలని కలెక్టరుకు వినతిపత్రం ఇచ్చేందుకు సమావేశ మందిరం వద్ద మూడు గంటలపాటు ఎదురు చూసినా పట్టించుకోకుండా వెళ్లిపోయారని పట్టణంలోని మార్వాడీ వీధికి చెందిన తిప్పమ్మబాయి (70) అనే వృద్ధురాలు విలేకరుల ఎదుట వాపోయింది.

ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీల్లో భారీ స్కోర్ దిశగా కృష్ణా జట్టు

● కడప... వెస్ట్‌గోదావరి జట్లు వెనుకంజ



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

కడప (స్పోర్ట్స్) జూలై 28: కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 ఇంటర్ డిస్ట్రిక్ట్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా ఆదివారం కృష్ణా జిల్లా జట్టు 370 పరుగుల భారీ స్కోర్ సాధించగా, కడప, వెస్ట్‌గోదావరి జట్లు ఎదురీదుతున్నాయి. వివరాలిలా...

ఏసీఏ క్రికెట్ స్టేడియంలో: వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో టాస్ నెగ్గిన కృష్ణా జట్టు 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఆట ముగిసే సమయానికి 370 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో వరుణ్ సాత్విక్ 158 పరుగులు చేయగా, గీత్ 84 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

కేఎస్ఆర్ఎం మైదానంలో: కేఎస్ఆర్ఎం మైదానంలో టాస్ నెగ్గిన కడప జట్టు బౌలింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు 63.3 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో కె. థామస్‌రామ్‌కుమార్ 104 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. ఇందులో గురువిఘ్నేష్ 59 పరుగులు చేయగా రోహిత్ 39 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

కెఓఆర్ఎం మైదానంలో..

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో టాస్ నెగ్గిన విశాఖ జట్టు 53 ఓవర్లలో 171 పరుగులకే కుప్పకూలింది. తదుపరి బ్యాటింగ్‌కు ప్రారంభించిన వెస్ట్ గోదావరి జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 33 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 123 పరుగులకే చేతులెత్తేసింది. దీంతో ఇంకా 48 పరుగుల లోటుతో ఎదురీదుతొంది. ఆటకు సోమవారం రెండవరోజు.

ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు

కడప(కలెక్టరేట్) జూలై 28: వేతన బకాయిలు చెల్లించాలని ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలోని ఎన్జీవో హోంలొ ఏపి ఎన్జీవో సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన డీఏను జూలై నెల జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లించనుండడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఉద్యోగులు పూర్తి స్థాయిలో సహకారం అందించేందుకు దోహదపడనుందన్నారు. జూలై నెల జీతం, పింఛన్లు కూడా ఆగస్టు 2వ తేదీలోగా ప్రభుత్వం చెల్లించేలా ప్రభుత్వం చర్య లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్ జిల్లా కార్యదర్శి డి. రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు తిమ్మారెడ్డి, కోశాధికారి నిత్యపూజయ్య, తాలూకా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్తపల్లి అగ్రహారం.. దారి మరీ అధ్వానం!

● ఐదేళ్ల క్రితం పనులు మంజూరు ● ఇంకా పూర్తికాని వైనం ● వర్షం వస్తే ఇబ్బంది పడుతున్న ప్రజలు



ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న కొత్తపల్లి అగ్రహారం రోడ్డు



కల్వర్టు వద్ద అధ్వానంగా రోడ్డు

పుల్లంపేట, జూలై 28: ఊరి పేరేమో కొత్తపల్లి అగ్రహారం. ఈ ఊరికి వెళ్లేదారి మరీ అధ్వానం. సక్రమమైన రహదారి లేకపోవడంతో వర్షాకాలంలో అవస్థలు వర్ణనాతీతం. ఎట్టకేలకు ఐదేళ్ల క్రితం తారురోడ్డు మంజూరై.. పనులు ప్రారంభమయ్యాయి.. కానీ కష్టాలు రెట్టింపయ్యాయి. వివరాల్లోకెళితే....

పుల్లంపేట మండలం కొమ్మనవారిపల్లె పంచాయతీ కొత్తపల్లి అగ్రహారంలో అందరూ వ్యవసాయ కూలీలే. 400 మంది వరకు జనాభా ఉంది. పుల్లంపేట నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు బాగా దెబ్బతినింది. మరమ్మతులు చేయాలని నేతలు, అధికారులను వేడుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. వర్షం వచ్చినపుడు పుల్లంపేటలోని పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు కూడా ఇబ్బందులు పడేవారు. దీంతో వర్షం కురిసినన్ని రోజులూ విద్యార్థులు బడికి సెలవులిచ్చేసేవారు. ఆటోలు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో గ్రామంలో ఎవరికైనా జబ్బు చేస్తే ఇబ్బందులు పడేవారు. దీంతో కొన్నిసార్లు గ్రామస్థులే చందాలు వేసుకుని రోడ్డును బాగు చేయించుకున్న సందర్భాలున్నాయి. ఐదేళ్ల కిందట ఈ గ్రామానికి స్పెషల్ గ్రాంట్ కింద తారురోడ్డు మంజూరైంది. రోడ్డు మంజూరైన ఏడాదికి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. రోడ్డుకిరువైపులా మట్టిని తీసి రోడ్డుపై వేసి పనులు ప్రారంభించడంతో గ్రామస్థులకు ఇబ్బంది ఉన్నా రోడ్డు బాగవుతుందన్న సంతోషంతో నెట్టుకొచ్చారు. ఆరు నెలలు తిరకగముందే రోడ్డు పనులు నిలిచిపోయాయి. అప్పటినుంచి గ్రామస్థుల కష్టాలు మరింత అధికమయ్యాయి. దీంతో చెరువు కట్టమీదుగా ఏడు కిలోమీటర్లు చుట్టుకుని పుల్లంపేటకు చేరుకునేవారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులంతా కలిసి అప్పట్లో రాజంపేట ఆర్డీఓ పఠాన్ అహ్మద్‌కు విన్నవించుకున్నారు. వెంటనే ఆర్డీఓ స్పందించి స్వయంగా గ్రామాన్ని సందర్శించారు. రోడ్డు పరిస్థితి చూసి అక్కడికక్కడే అధికారులతో మాట్లాడారు. వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. చెప్పిన విధానంగానే పనులు ప్రారంభమయ్యాయి. ఏమైందో ఏమో రోడ్డుపై కంకర వేసినా పనులు మధ్యలోనే ఆగిపోయాయి. తారు వేస్తే ఈ రోడ్డు పూర్తవుతుంది. రోడ్డు పనులు మళ్లీ ఆగిపోవడంతో గ్రామవాసుల కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. ప్రస్తుతం కల్వర్టులు పూర్తికాక పోవడంతో వర్షం వస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు ఈ రోడ్డును పూర్తి చేసి కొత్తపల్లి వాసుల కష్టాలను తీర్చాలని అధికారులు, నేతలను వేడుకుంటున్నారు.

వర్షం వస్తే తిప్పలే..



వర్షం వచ్చినప్పుడు మా బాధలు వర్ణానీతం. రోడ్డు అంతా బురదమయమై చెప్పులు చేతుల్లో పట్టుకుని నడవాల్సిందే. లేదంటే జారిపడి కిందపడితే ఏం విరుగుతుందో చెప్పలేం. గతంలో కిందపడి ఆస్పత్రి పాలైన వాళ్లు కూడా ఉన్నారు. ఇప్పటికైనా రోడ్డును బాగుచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రమణ, కొత్తపల్లె అగ్రహారం

వైసీపీ తొత్తు ఆస్కార్‌రావు

● ఉద్యోగుల పక్షానా పోరాడుతున్న నేత సూర్యనారాయణ

● ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘు జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్



మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఎం.రమేష్ కుమార్

కడప(కలెక్టరేట్), జూలై 28: ఉద్యోగుల వ్యతిరేక విధానాలతోపాటు, వైసీపీకి తొత్తుగా వ్యవహరించడంతో ఆస్కార్ రావు, శ్రీకాంత్‌ను సంఘం నుంచి గతంలోనే బహిష్కరించామని ప్రభుత్వ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.రమేష్ బాబు స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో రాష్ట్ర సెక్రటరీ రఘు రామనాయుడు, నగర అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్‌తో కలసి ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలో కానీ, ఏ జిల్లాలో కూడా అధ్యక్ష ,కార్యవర్గ సభ్యత్వం లేని ఆస్కార్ రావు, శ్రీకాంత్ రాజు విజయవాడలో ప్రెస్‌మీట్ పెట్టి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల పక్షాన పోరాడుతున్న సూర్యనారాయణపై తీవ్ర ఆరోపణలు చేయడమే కాకుండా సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇలాంటి చవకబారు ప్రకటనలను ఖండిస్తూ కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల నుంచి తాము సూర్యనారాయణకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. 6 నెలలుగా ఆస్కార్ రావు రాష్ట్ర అధ్యక్ష పదవిపై కన్ను వేశారన్నారు. సూర్యనారాయణపై గత వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు పెడితే, పదవీ కాంక్షతో అవ కాశంగా మలుచు కోవాలనీ కుట్ర పన్ని విఫలమయ్యారని విమర్శించారు ఉద్యోగులు, కార్మికుల పక్షాన రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ పోరాడుతుంటే ఆస్కార్‌రావు బృందం మాత్రం వైసీపీతో అంటకాగుతూ మీటింగ్‌లో ఎవరు పాల్గొనకుండా బెదిరింపులకు దిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతినేలా ఐక్యవేదిక సమావేశాలకు హాజరు కాకుండా జగన్ ప్రభుత్వం కోసం ఆ స్కార్ రావు పడిన తాపత్రయం ఉద్యోగ,కార్మిక ,పెన్షనర్లకు తెలుసన్నారు. వారి వ్యవహార శైలిని గమనించిన రాష్ట్ర, జిల్లా కార్యవర్గాలు సంఘ కార్యకలపాలకు సంబంధం లేకుండా పూర్తిగా బహిష్కరించిన తరువాత కూడా ఇలాంటి మీడియా సమావేశాలు నిర్వహించే అర్హత లేదని హెచ్చరించారు. ఆస్కారరావును ఉద్యోగులు నమ్మరన్నారు. బహిష్కరించినప్పటికీ ప్రధాన కార్యదర్శి పదవి కోసం వెంపర్లాడుతున్న ఆ స్కార్‌రావు, శ్రీకాంత్ రాజు కుట్రలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని రమేష్ కుమార్ స్పష్టం చేశారు. ఈసమావేశంలో జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి నాగశేషులు, రాధాకృష్ణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి

● ఆరు నెలల్లో నీటి సమస్య పరిష్కారం ● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, జూలై 28: రాబోయే ఆరు నెలల్లో రాయచోటి నియోజకవర్గంలో నీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తాగు, సాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇందులో భాగంగా రాయచోటి నియోజకవర్గంలో రాబోయే ఆరు మాసాల్లో పూర్తిగా నీటి సమస్య పరిష్కరించేందుకు ఒక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. గతంలో నియోజకవర్గ ప్రజలు నీటి సమస్యలతో నానా ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. దీంతో రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో ప్రజలకు ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలో ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందో గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం నీటి సమస్య కోసం బోర్లు వేయించడం, పైపులైన్‌ల మరమ్మతులు చేపట్టడం, నియోజకవర్గంలో ఉన్న మంచినీటి పథకాలను ఉపయోగంలోకి తీసుకురావడం వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇందులో భాగంగా ఆదివారం నియోకవర్గంలోని రామాపురం మండలంలో నల్లగుట్టపల్లె హరిజనవాడలో, సంబేపల్లె మండలంలోని దుద్యాల గ్రామంలో, దిగువ మాదిగపల్లెల్లో రెండు కొత్త బోర్లను మంత్రి సోదరులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. జిల్లాలోని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఎక్కడ నీటి సమస్య ఉన్నా వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రజలు సహకరించి రాయచోటిని నీటి సమస్య రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని మంత్రి కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి(కలెక్టరేట్), జూలై 28: ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్‌తో పాటు, మండలాల ప్రజలు వారి సమస్యలను తెలియజేచేందుకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు రావల్సిందిగా వారు తెలియజేశారు.



ప్రజల ప్రాణాలతో వ్యాపారమా?

- కోళ్లవ్యర్థాలతో చికెన్ పకోడీ, షార్వా తయారీ
- మాంసం ప్రియులను దోచుకుంటున్న వ్యాపారులు
- అనారోగ్యానికి గురవుతున్న మాంసాహారులు
- వీధివీధినా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు

పులివెందుల టౌన్, జూలై 28: ఘుమఘుమలాడే మసాలాలో బాగా వేగిన లేతమాంసపు ముక్కలను ఇస్తున్నప్పుడు ఆ అనుభూతి చెప్పలేం. రొటీన్‌కు భిన్నంగా (ఎలా తయారుచేసినప్పటికి) రోడ్డు పక్కన బండ్లపై ముఖ్యంగా మద్యం షాపుల వద్ద విక్రయించే చికెన్ పకోడీ చూడగానే అటుగా వెళ్తున్న మాంసప్రియుల బండికి బ్రేకు పడకతప్పదు. ముక్క వాసన ముక్కుకు తగలగానే తినాలనే కోరిక కట్టిపడేస్తుంది. దీంతో కోడి వ్యర్థాలతో తయారుచేసిన ఈ చికెన్ పకోడీ, షార్వా నినడం వల్ల మాంసం ప్రియులు అనారోగ్యంపాలవుతున్నారు. సం బంధిత అధికారులు ఈ వ్యర్థపదార్థాల అమ్మకాలపై స్పందించకపోవడంతో వారివ్యాపారం మూడు మటన్‌లు, ఆరు చికెన్‌లుగా సాగుతోంది. హోటళ్లు, మాంసం విక్రయకేంద్రాలు ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్నా యి. ఒకపక్క కలుషిత ఆహారం, మరోపక్క నిల్వ ఉంచిన ఆహారం కారణంగా ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. కోడి మాంసం (చికెన్) అంటే ఇష్టపడని వారు ఉండరు. ప్రస్తుతం నాటు కోడి కంటే బాయిలర్ కోడిమాంసం పైనే మొగ్గుచూపుతున్నారు. ఈ మాంసం తింటే ప్రమాదమని తెలిసినా మాం సంప్రియులు వదలరు. బాయిలర్ పక్వానికి వచ్చేందుకు పలు రకాల ఇంజక్షన్లు, ఆహారం పెడుతుంటా రు. అంతేకాకుండా రసాయనాల ప్రభావం ఆ కోడి పై ఉంటుంది. రసాయనాలు, ఇంజక్షన్ల ప్రభావం కో డి చర్మంపై ఎక్కువగా ఉంటుందని సర్వేలో తేలింది. అందుకే చాలా మంది మాంసంప్రియులు కోడి చర్మం తొలగించి మాంసం తిం టుంటారు. అయితే ప్రజలు వినియోగించని కోడి వ్యర్థాలను, చర్మాన్ని పలువురు వ్యాపారులు తెలివిగా సొమ్ముచేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా కోడి అమ్మగా మిగిలిన వ్యర్థాలను, కోడి చర్మం, కాళ్లను హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ నిర్వాహకులు అతి తక్కువకు కొని చికెన్ పకోడీ తయారు చేసి అమ్ముకుంటున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. డాబాలు, రెస్టారెంట్లు, సంగటి హోటళ్లలో షార్వా రూపంలో తయారు చేసి వ్యాపారం చేస్తుంటారు. చికెన్ పకోడీ కిలో రూ.400 ధరతో అమ్ముతున్నారు. వ్యర్థాలు అని తెలియకుండా మొక్కజొన్నపిండి, మసాలాలు దట్టంగా పట్టిస్తుండటంతో బరువుపెరిగి వ్యర్థాలు అని తెలియకుండా మాంసం ప్రియులను మసిపూసి మారేడుకాయ చేస్తున్నారు. నూనె వాడకంలో కూడా వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు.చికెన్ పకోడీ వేయించిన నూనెను ఒక్కసారి మాత్రమే వాడాల్సి ఉంటుందన్నారు. కానీ వ్యాపారులు ముందురోజు మిగిలిన నూనెలోనే మరికొంత నూనె కలిపి మరుసటి రోజు చికెన్ పకోడీ తయారీకి ఉపయోగిస్తున్నారా, వాడిన నూనెను మళ్లీ వాడడం వల్ల గ్యాస్ట్రబుల్, కడుపులో మంట, అలర్జీ, వివిధ రకాల వ్యా ధులు వచ్చే అవకాశం ఉందని డాక్టర్లు చెబుతున్నారు.


కోడి చర్మం, వ్యర్థ పదార్థాలతో తయారుచేసిన చికెన్ పకోడీ... హోటల్‌లో తనిఖీలు చేస్తున్న కమిషనర్

హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఇదేతీరు

పట్టణంలోని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకులు బిర్యానీతో ఇవ్వాల్సిన షార్వా నాశిరకంగా తయారు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. చికెన్ వ్యర్థాలు అయి న తల, మెడ, కాళ్లు, చర్మం భాగాలతో తయారుచేసిన చికెన్ షార్వా బిర్యానీతో అంటగడుతున్నారు. అధిక ధరలు వసూలు చేస్తున్నారు. కోడి పేగులను, ఇతర వ్యర్థాలను మటన్ బోటిపేరు చెప్పి బహిరంగంగా నిలువుదోపిడీకి పాల్పడుతున్నారు. ఇటువంటి అవశేష వ్యర్థాలను తినడం వల్ల పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు అంటున్నారు.

పుట్టగొడుగుల్లా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు

ఏ రోడ్డుపై చూసినా, ఏ సందులో చూసినా ఫాస్ట్‌ఫుడ్ సెం టర్లు పుట్టగొడుగుల్లా ఉంటున్నాయి. ఆయా సెంటర్ల వద్ద తాజాగా ఉండే పదార్థాల కన్నా ఫ్రిడ్జ్‌లో ఉంచి వండించే ఆహారపదార్థాలే ఎక్కువ. ఒకరోజు వ్యాపారం లేకపోతే మిగిలిన మాంసం, చేపలు ఫ్రిడ్జ్‌లోపెట్టి మరుసటి రోజు వినియోగించడం సర్వసాధారణం. హోటళ్లలో అయితే నాలుగు రోజుల పాటు నిల్వ ఉన్నవాటిని వాడుతుంటారు. వాటికి కారణం అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే.

లైసెన్స్ లేని చికెన్ సెంటర్లు

మాంసం విక్రయ కేంద్రాలు కూడా ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్నారు. కనీస పరిశుభ్రత లేకుండా ఉండడం, గంటల తరబడి మాంసం వేలాడదీస్తూ విక్ర యించడం వల్ల దుమ్మూధూళి, ఈగలు వాలడం వల్ల అది అపరిశుభ్రమవుతుంది. మాంసం ఎప్పటికప్పుడు తయారు చేసి విక్రయించే దుకాణాలు చాలా తక్కువగా ఉంటున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించకపోవడం వల్ల ఇలాంటివి జరుగుతున్నాయి. గతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మండలానికి ఒకరు ఉండేవారు. కానీ ప్రస్తుతం ఫుడ్‌సేఫ్టీ అధికారులు నియోజకవర్గానికి ఒక్కరు మాత్రమే ఉండడం వల్ల పర్యవేక్షణ లోపిస్తోంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

పట్టించుకోని అధికారులు

మాంసం ప్రియులను నిలువుదోపిడీకి గురిచేస్తున్న వ్యాపారులపై సంబంధిత అధికారులు దాడులు నిర్వహిస్తే నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడరని, నిర్వాహకులపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పట్టణ ప్రజలుకోరు తున్నారు. అలసత్వం వహించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

శుభ్రత పాటించకపోతే కఠిన చర్యలు

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మాంసం విక్రయ కేంద్రాలకు లైసెన్సులు తప్పనిసరి. కానీ చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారు లైసెన్సులు తీసుకొని వ్యాపారం చేసుకునేంత సా హసం చేయరు. కానీ వారు ప్రజలకు అందించే మాంసం లేక ఆహారపదార్థాలు చుసీ శుభ్రతగా ఉండాలి. అలా పాటించని వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. పట్టణంలోని ఓ హోటల్లో మాంసం నిల్వ, విక్రయాలపై తనిఖీలు చేయడం జరిగింది. వారికి హెచ్చరికలు జారీ చేశాం. మాంసం ఆరుబయట పెట్టడం, దుకాణాల్లో అపరిశుభ్రత ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లైసెన్సు తీసు కుని నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే అలాంటి దుకాణాలు మూసివేస్తాం.

- మున్సిపల్ కమిషనర్, పులివెందుల


మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

- పీఎస్ఎఫ్, ఏఐబీఎస్ఎస్ డిమాండ్

కడప (నాగరాజుపేట), జూలై 28 : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు పెండింగులో ఉన్న మెస్ బిల్లులు విడుదల చేయాలని పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీపీ నాగేంద్ర, ఏఐబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్ నాయక్ డిమాండ్ చేశారు. కడప నగరంలోని బాలుర హాస్టల్‌లో నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, గురుకుల వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఎనిమిది నెలలుగా మెస్ చార్జీలు అందలేదన్నారు. నిత్యావసర సరుకులు రోజురోజుకూ పెరిగిపోవడంతో నిర్వహణ భారంగా ఉందని, వార్డెన్లు తమ దృష్టికి తెచ్చారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆయా సమస్యలపై స్పందించి పెండింగులో ఉన్న మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరుణ్, క్రిష్ణ, తేజ తదితరులు పాల్గొన్నారు.

'దళితుడికి న్యాయం చేయండి'

కడప (మారుతీనగర్), జూలై 28: దళితుడనే చిన్నచూపుతో మాగిపోగు సుధాకర్ అనే ఔట్ సోర్సింగ్ స్కూల్ వాచ్‌మెన్‌ను విధుల నుంచి అకారణంగా తొలగించి మరో వ్యక్తిని సమకూర్చుకున్న బద్వేల్‌లోని కన్యకాపరమేశ్వరి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకుని సుధాకర్‌కు న్యాయం జరిగేలా చూడాలని దళిత సంఘాల ప్రతినిధులు నాగయ్య, జేవీ రమణ కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 15 సంవత్సరాలుగా సుధాకర్ తండ్రి ఎం.శౌరి సదరు స్కూల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో 2023 సెప్టెంబర్ 26న చనిపోయాడన్నారు. దీంతో ఆయన కుమరుడైన సుధాకర్ ఆ స్కూల్‌లో వాచ్‌మెన్‌గా చేర్చుకోవడంతో నాటి నుంచి డ్యూటీలో కొనసాగుతున్నాన్నారు. 5నెలల పాటు సుధాకర్‌తో విధులు నిర్వహించుకుని అకారణంగా తొలగించడం విచారకరమని పేర్కొన్నారు.



ఎన్డీఏ ప్రభుత్వం సంక్షేమ పథకాల

పేర్లు మార్చడం స్ఫూర్తిదాయకం

- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 28 : ఎన్డీఏ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేర్లు మార్చడం, దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ శ్రద్ధ వహించడం స్ఫూర్తిదాయకమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్‌హరిక్రిష్ణ తెలిపారు. వైసీపీ ప్రభుత్వం జగన్ పేరును ప్రతి సంక్షేమ పథకానికి ముందు జగనన్న పేరు చేర్చడం వల్ల పబ్లిసిటీ యావ అర్థం పడుతోందన్నారు. సంక్షేమ పథకాలతో వారి పేర్లు పెట్టుకున్నంత మాత్రాన ఓట్లు రాలవని, ఇప్పటికైనా తెలుసుకోవాలన్నారు. దేశంలో గొప్ప నాయకుల పేర్లతో ఉన్న పథకాలు ఎప్పటికీ మార్చకూడదని, ఇది మనం వారికిచ్చే గౌరవమని తెలిపారు. జగనన్న గోరుముద్ద పేరును డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంగా నామకరణం చేయడంలో పవన్‌కళ్యాణ్ సామాజిక స్పృహ వ్యక్తమవుతోందన్నారు. అలాగే వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరును కూడా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీగా మార్చాలని వైఎస్ఆర్ కడప జిల్లా పేరులో వైఎస్ఆర్ పేరు తొలగించి కడప జిల్లాగా నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు శ్రీనివాసులు, తొగట రాష్ట్ర సమితి సభ్యులు వెంకటరమణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 28 : పాఠశాలల్లో అత్యవసర సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌చంద్ర, ఆలీఖాన్ ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలల నిర్వహణ గ్రాంటును నిర్వహణ ఖాతాల్లో జమ చేయాలన్నారు. బోధనేతర పనుల నిమిత్తం ఉన్నత పాఠశాలలకు ఎడ్యుకేషన్ అసిస్టెంటును నియమించాలన్నారు. అవసరం ఉన్న చోట బోధన సిబ్బందిని నియమించాలన్నారు. మెర్జింగ్‌కు నోచుకున్న ప్రాథమిక పాఠశాలల్లో మూడో తరగతి కొనసాగేలా చూడాలని కోరారు.

మెరిట్ విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి

చెన్నూరు, జూలై 28 : చెన్నూరు మండలంలో ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన కొండపేటకు చెందిన ఆర్.జగన్నాథరెడ్డికి చెన్నూరు మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.5వేలు ప్రోత్సాహక బహుమతి అందించారు. స్థానిక రామాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ విద్యార్థికి మానవతా సంస్థ అధ్యక్షుడు ఆవుల బసిరెడ్డి ఈ బహుమతి అందించారు.

గంగమ్మ తల్లికి పూజలు

సీకేదిన్నె, జూలై 28: ఆదివారం గంగమ్మ తల్లికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. మండలంలోని కొత్తపేట గంగమ్మ తల్లికి భక్తులు బోనాలు సమర్పించి తమ కో ర్కెలు తీర్చాలని అమ్మవారిని వేడుకున్నారు. గతంలో కోరిన కోర్కెలు నెరవేర్చుకున్న భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకుని బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు ఆరగించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేంపల్లె, జూలై 28: వేంపల్లె పాపాఘ్ని నదిలో ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పులివెందుల సెబ్ సీఐ సబితరెడ్డి, వేంపల్లె సీఐ చాంద్‌బాషలు పట్టుకున్నారు. అందిన సమాచారంతో దాడులు నిర్వహించగా ఇసును అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టుబడ్డాయని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి సెబ్ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం


వైద్యం అందిస్తున్న డాక్టర్ మహబూబ్ ఆలీ

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 28 : కడప నగరంలోని మెడికేర్ హాస్పిటల్‌లో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు డాక్టర్ మహబూబ్ ఆలీ తెలిపారు. ఈ ఉచిత వైద్యశిబిరం దాదాపు మూడు వేలు విలువ గల షుగరు, కొలెస్టాల్, ఈసీజీ, న్యూరోపతి పరీక్షలు ఉచితంగా అందించారు. అనంతరం డాక్టర్ మహబూబ్ ఆలీ మాట్లాడుతూ మధుమేహం లేదా చక్కెర వ్యాధిని వైద్యపరిభాషలో డయాబెటిస్ మెల్లిటస్ అంటారు. డయాబెటిస్‌కు మూలకారణం రక్తంలో చక్కెర ఎక్కువగా పోగుపడడం, గ్లైకోజ్ మన ఆరోగ్యానికి ఎంతో అవసరం. ఇది శరీర కండరాలు, ఆరోగ్యానికి ఎంతో అవసరమన్నారు. ఇది శరీర కండరాలు, కణజాలాలను తయారు చేసే కణాలకు శక్తినిచ్చే ముఖ్యమైన మూలం, మీ రక్తంలో చెక్కర స్థాయి అధికంగా ఉండే తీవ్రమైన ఆరోగ్య సమస్యకు దారితీస్తుందన్నారు. స్ట్రోక్, గుండెపోటు, చూపు తగ్గిపోవడం, పాదాలు, కాళ్లు తొలగించాల్సి రావడం, కిడ్నీల వైఫల్యం వంటి పరిణామాలకు డయాబెటిస్ కారణం అవుతుందన్నారు. సాధారణంగా మధుమేహం లేదా చక్కెర వ్యాధిని రక్తంలో మితిమీరిన చక్కెర స్థాయిని బట్టి గుర్తిస్తారన్నారు. సయీద్‌నూర్, షాహిద్‌పఠాన్, గౌతమి, అయేషా, భార్గవి, వైష్ణవి, శిరీషారెడ్డి, మౌలాని, సువర్ణలతో పాటు మెడికల్ రెప్‌లు పాల్గొన్నారు.

విజయవంతంగా జనసేన సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదులో పాల్గొన్న జనసేన సభ్యులు

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 28 : కడప అసెంబ్లీ నియోజకవర్గంలో వెయ్యి మంది సభ్యత్వ నమోదుతో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతమైందని ఆ పార్టీ నేత తుంగా రమణయ్య తెలిపారు. ఆదివారం స్థానిక విశ్వప్రగతి చిట్‌ఫండ్ కార్యాలయంలో జరిగిన స మావేశంలో తుంగా రమణయ్య మాట్లాడు తూ ఉప ముఖ్యమంత్రి జనసేనాని పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జూలై 18 నుంచి 28 వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కడప నియోజకవర్గంలో విస్తృతంగా చేప ట్టామ న్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సాయి గజ్జల, చార్లెస్, తుంగ కిరణ్, తుంగ మధు, ప్రసాద్, మురళి, శివ, చరణ్, జన సైనికులు పాల్గొన్నారు.

అకడమిక్ క్యాలెండరు ప్రకటించాలి

కడప (ఎడ్యుకేషన్), జూలై 28 : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అకడమిక్ క్యాలెండరును ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ కోరారు. ఆదివారం యూటీ ఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో విద్యార్థులు తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో పరీక్షలు రాసేవారన్నారు. వైసీపీ హయాంలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి ఇంగ్లీషు మీడియంలోనే పరీక్ష రాయాలని చెప్పిందన్నారు. దీనిపై టీడీపీ కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. తెలుగు ఇంగ్లీషు మీడియాన్ని సమాంతరంగా నడపాలన్నారు. యుడైస్ లెక్కల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో 39 లక్షలమంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. యుటిఎఫ్ ప్రభుత్వ పాఠశాలలను కాపాడేందుకు, విద్యార్థులసంఖ్య పెరిగేందుకు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లాఅధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెంమహేశ్‌బాబు, సహాధ్యక్షులు రవికుమార్, కౌన్సిల్ మెంబరు రాము పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే సహకార సంఘాల ధ్యేయం

కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూలై 28 :పర్యావరణ పరిరక్షణే సహకార సంఘాల ధ్యేయమని డీసీసీబీ ప్రత్యేక అధికారి బి.గురప్ప పేర్కొన్నారు. ప్రపంచ ప్రకృతి దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆర్‌కేనగర్ బ్రాంచ్ ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలంలో కాలుష్యం ఎక్కువై వాతావరణం సమతుల్యత లోపిస్తోందన్నారు. ముంచుకొస్తున్న ప్రమాదాన్ని నివారించేందుకు సామాజిక బాధ్యత - శ్రేయస్సు అన్న నినాదంతో ప్రతి సంఘంలో తమ సభ్యులతో విరివిగా మొక్కలు నాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజరు శ్రావణి, ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

శివానందపురంలో రియల్ ఎస్టేట్ మాఫియా

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 28: కడప కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న శివానందపురంపై బుద్ద రియల్ ఎస్టేట్ మాఫియా పెద్దల పెత్తనం జోరుగా సాగుతోందని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం శివానందపురం ఎస్టేట్ పరిసర ప్రాంతాల్లో తన బృందంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ బుద్ద టౌన్‌షిప్ డెవలప్‌మెంట్ కోసం శివానందపురంలో అధికార భూదాహంతో శ్మశాన స్థలం సైతం మింగేసి అందులో ఇళ్లు నిర్మించుకుని చెరువును శ్మశానంగా మార్చారన్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని, వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో స్థానిక ప్రజలతో కలిసి ప్రత్యక్ష ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. నగర కార్యదర్శివర్గ సభ్యులు మడగలం ప్రసాద్, విజయ్, కుమార్, రమేశ్, వినోద్, పేతురు, అంకయ్య, శ్రీను పాల్గొన్నారు.

అసెంబ్లీలో సమస్యలపై గళంవిప్పిన కడప ఎమ్మెల్యే

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 28 : అసెంబ్లీలో కడప నియోజకవర్గ సమస్యలపై గళం విప్పిన ఏకైక ఎమ్మెల్యే మాధవీ అని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిలానీబాషా తెలిపారు. ఆదివారం కడప నగరం మోచంపేట తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా మాధవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ప్రతి ఇంటికీ తిరిగి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారన్నారు. గతంలో ఎంతో మంది ఎమ్మెల్యేలుగాగెలిచినా ఏ ఒక్కరు కూడా అసెంబ్లీలో కడప సమస్యలపై ప్రస్తావించలేదని అన్నారు. అలాగే కడప నగరానికి సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత మంత్రులు దృష్టికి కూడా తెచ్చి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచీకరణ విధానాల వల్లే రాష్ట్రానికి అప్పులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 28 : ప్రపంచీకరణ విధానాల వల్లనే అప్పులు పెరిగిపోతున్నాయని ఆర్థిక విశ్లేషకుడు వి.రాంభూపాల్ పేర్కొన్నారు. 2025లో ప్రపంచం ఆర్థిక సంక్షోభం చేరుకుంటుందన్నారు. ఆదివారం కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాసదస్సు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.లక్ష్మిరాజా అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక శ్వేత పత్రం- వాస్తవాలు అనే అంశంపై ఆర్థిక విశ్లేషకుడు మాట్లాడారు. అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్ష ప్రధాన క్యాదర్శులు విజయకుమార్, మహేశ్‌బాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, షేక్‌జాబీర్, అనంతపురం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందురాజు, లింగమయ్య పాల్గొన్నారు.

పుష్పగిరి ఆలయంలో

ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ వీసీ

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 28 : పుష్పగిరి పుణ్యక్షేత్రంలోని చెన్నకేశవస్వామి ఆలయాన్ని కడప వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు చేసి దర్శనం చేయించారు. ఆలయ పూజారులు పుష్పగిరి స్థల పురాణం విశిష్టతను వీసీకి వివరించారు. అనంతరం పూజారులు వేదాశీర్వాదం ఇచ్చారు. వైస్‌ఛాన్సలర్ ఆలయంలోని అద్భుతమైన శిల్పకళాసంపదను పరిశీలించారు.

'టీడీపీపై బురద జల్లడం తగదు'

వేంపల్లె, జూలై 28: వేంపల్లె పాపాఘ్ని నదిలో ఇసుక అక్రమ రవాణాకు టీడీపీ నాయకులకు గాని, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవికి గాని ఎలాంటి సంబంధం లేదని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ తెలిపారు. ఎక్కడో రవాణా జరుగుతున్న పాత ఫోటోలను జగన్ పత్రిక ప్రచురించి వేంపల్లెలో చేస్తున్నారని టీడీపీపై బురదజల్లడం తగదన్నారు. వేంపల్లె టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఇసుక విధానం నిబంధనలు తప్పక పాటించాలని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అందుకుతగ్గట్లుగా ఉండాలని బీటెక్‌రవి పదేపదే చెబుతున్నారని గుర్తుచేశారు. టీడీపీ జిల్లా మాజీకార్యదర్శి పివి రమణ, మండల ఉపాధ్యక్షులు పసుపులేటి భద్ర, డాక్టర్ డివి సుబ్బారెడ్డి, నామా వేమ, మడక శ్రీను, జబీల్, డక్కా రమేష్, మహమ్మద్, భాస్కర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



యూసీఐఎల్‌కు రెండవ బహుమతి




అవార్డు అందుకుంటున్న యూసీఐఎల్ అధికారుల బృందం

వేముల, జూలై 28: మండలంలోని తుమ్మలపల్లె వద్దనున్న యూసీఐఎల్‌కు మైన్స్ సేఫ్టీ అవార్డ్-2024లో మెటల్ మీడియం కేటగిరీలో రెండవ బహుమతిని గెలుచుకున్నట్లు యూసీఐఎల్ అధికారులు తెలిపారు. ఆదివారం కోల్‌కతాలోని బిశ్వగీత్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ నుంచి కిషోర్ భగత్, కెకె రావు, ఎన్‌వీవీ శేఖరంబాబు, రాములు వి.గంగాధర్‌లతో సమా అధికారుల బృందం అందుకున్నట్లు తెలిపారు. తమ కార్యకలాపాలలో భద్రతకు సంబంధించిన అత్యున్నత ప్రమాణాలనునిర్ధారించడంలో ఉన్న తిరుగులేని నిబద్ధతకు నిదర్శనమన్నారు. యూసీఐఎల్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ సత్పతి, జనరల్ మేనేజర్ మనోజ్‌కుమార్, జనరల్ మేనేజర్ ఎంఎస్ రావు, డీజీఎం సర్కార్ అభినందనలు తెలిపారు.

గండి ఆర్యవైశ్య అన్నదాన

సత్ర అధ్యక్షుడిగా కిషోర్



వేంపల్లె, జూలై 28: గండి వాసవి ఆర్యవైశ్య నిత్యఅన్నదాన సత్రం అధ్యక్షుడిగా వేంపల్లెకు చెందిన పచ్చిపులుసు కిషోర్ ఎన్నికయ్యారు. వేంపల్లెలోని అమ్మవారిశాలలో వేంపల్లె ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో అన్నదాన స త్రం చైర్మన్ ఎన్నిక ఆదివారం జరిగింది. కిషో ర్, దొంతుసుబ్బారావు, తోటంశెట్టి చంద్రశేఖర్‌లు ఎన్నికలో పోటీపడ్డారు. 329ఓట్లు పోల్ కాగా కిషోర్‌కు 132ఓట్లు, సుబ్బారావుకు 130, చంద్రశేఖర్‌కు 65ఓట్లు లభించాయి. హోరాహోరీగా జరిగిన ఈ ఎన్నికలో రెండు ఓట్లతో పచ్చిపులుసు కిషోర్ ఎన్నికయ్యారు.

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌కు సత్కారం

వేంపల్లె, జూలై 28 : వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సాదిక్ బాషాకు మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సత్కరించారు. శ్రీచైతన్య హైస్కూల్లో మానవత సంస్థ మాసాంతర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సాదిక్‌బాషా హాజరయ్యారు.

ప్రహరీ నిర్మాణం ఎప్పుడు..?

● ప్రజా సమస్యలు పరిష్కరించే అధికారులే వారి సమస్య పరిష్కరించుకోలేదు ● ప్రహరీ సమస్య కలెక్టర్‌ను అడగడానికి భయం ఎందుకో..?

జమ్మలమడుగు, జూలై 28: జమ్మలమడుగు డివిజన్ కేంద్రం తహసీల్దారు కార్యాలయం బ్రిటీష్ కాలం నాటిది. పాత బస్టాండుకు సమీపాన బ్రిటీష్‌వారు 14 గ్రామ పంచాయతీలకు 28 గ్రామాలకు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తహసీల్దారు కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, పోలీసు స్టేషన్, కోర్టు, సబ్‌జైలు, సబ్‌ట్రెజరీ కార్యాలయం ఒకే ప్రాంగణంలో అప్పట్లో నిర్మాణం చేపట్టారు. కాలానుగుణంగా కోర్టు, ప్రొద్దుటూరు రోడ్డుకు డీఎస్పీ కార్యాలయం ఎదురుగా మార్చడం జరిగింది. దాని స్థానంలో అర్బన్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసి ఏడాది క్రితం తాడిపత్రి రోడ్డులో పోలీసు క్వార్టర్స్ ఆవరణలో నిర్మించిన ప్రదేశానికి తరలించారు. ప్రస్తుతం తహసీల్దారు కార్యాలయం సమీప గ్రామాల ప్రజలందరికీ సౌకర్యవంతంగా ఉంది. అయితే కార్యాలయానికి వచ్చే ప్రజల ద్విచక్ర వాహనాలు పెట్టుకోవడానికి ఇబ్బందికరంగా ఉంది. ఏడాది క్రితం కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు తహసీల్దారు కార్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మించాలని సిమెంటు పిల్లర్స్ వేశారు. తర్వాత ఎందుకో పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి ఆవరణలోకి ఒక ద్విచక్ర వాహనం వెళ్లాలన్నా లేదు. సొంత సిబ్బందే పాత పోలీసు స్టేషన్‌లో వెళ్లి వెనుకభాగంలో వాహనాలను పెట్టుకుంటున్నారు. ఇటీవల 15 రోజుల క్రితం రూరల్ పోలీసు స్టేషన్‌కు సంబంధించిన పోలీసులు గేటు వేసి ఎవరూ రాకూడదని ఆదేశించారు. దీంతో తహసీల్దారు కార్యాలయ సిబ్బంది దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మళ్లీ అక్కడ విధులు నిర్వహించే పోలీసులకు చెప్పుకుని వాహనాలను వెనుకభాగంలో తీసుకెళ్లారు. ఇంత ఇబ్బంది పడుతున్నా తహసీల్దారు కార్యాలయ సిబ్బంది అధికారులకు చెప్పాలన్నా చెప్పలేకపోయారు. ఆదివారం కలెక్టర్ జమ్మలమడుగులోని ఉచిత వైద్యశిబిరం ప్రారంభించడానికి వచ్చి నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లో సమస్యలపై అధికారులకు సమీక్ష నిర్వహించారు. ఎక్కడో నియోజకవర్గంలోని సమస్యలన్నీ చెప్పిన అధికారులు సొంత జమ్మలమడుగు రెవెన్యూ కార్యాలయానికి ప్రహరీ సమస్య చెప్పడానికి ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడంలేదు. తహసీల్దారు కార్యాలయంతోపాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలన్నీ వారి వారి అనుకూల ప్రాంతాలకు తరలించే దిశగా ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనా తహసీల్దారు కార్యాలయం మాత్రం ప్రజలకు సౌకర్యవంతంగా ఇప్పుడున్న ప్రాంతంలోనే ఉండాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు భయం వీడి ప్రహరీ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలకు ఇబ్బందికరంగా ఉందని, ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చర్యలు తీసుకోవాలని గతంలో ప్రహరీ నిర్మించేందుకు స్థానిక వైసీపీ నేతలు అడ్డుపడినట్లుగా అప్పట్లో దినపత్రికల్లో కథనాలు ప్రచురితం అయ్యాయి. రెవెన్యూ అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.


ప్రహరీలేని తహసీల్దారు కార్యాలయం


తహసీల్దారు కార్యాలయం ఎదురుగా ఆక్రమణలు

9న చలో ఢిల్లీని జయప్రదం చేయండి

మైదుకూరు రూరల్ జూలై 28 : హలో మాల, చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని మాల సంఘం జేఏసీ ఛైర్మెన్ గోళ్ల అరుణ్‌కుమార్ ఆదివారం విలేకరుల సమావేశంలో పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వద్దు, ఐక్యతే ముద్దు అనే నినాదంతో తెలుగురాష్ట్రాల ప్రజలు ముందుకు నడవాలని కోరారు. ఆగస్టు 9 వ తేదీన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢీల్లీ జంతర్‌మంతర్ వద్ద జరుపుతున్న ధర్నాకు మాలలు రావాలని కోరారు.

ఆకట్టుకున్న ప్రవచనాలు


ప్రవచనాలు వినిపిస్తున్న వేంకటరామనాథశర్మ

ప్రొద్దుటూరు టౌన్, జూలై 28: అమ్మవారిశాలలో మల్లాది వేంకటరామనాథశర్మ వినిపించిన ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆదివారం శివపురాణం, రామాయణం, సీతాకల్యాణం, రుక్మిని కల్యాణం, శివకల్యాణం గురించి ప్రవచనాలను బోధించారు. ఆదిదంపతులు పార్వతీపరమేశ్వరులు ఆదర్శమని పేర్కొన్నారు. దంపతుల మధ్య ప్రేమాభిమానాలు అన్యోన్యత ఉండాలని సూచించారు. సీతారాములు కుటుంబ ధర్మానికి ఆదర్శప్రాయులని, అలాగే ధర్మాచరణలో భార్యాభర్తలు కలిసి నడవాలన్నారు. క్రిష్ణపరమాత్ముడు, జగ ద్గురువు అయిన గృహస్త ధర్మానికి ప్రాధాన్యత ఇచ్చి రుక్మిదేవి కల్యాణం చేసుకున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలి శరీరానికి దివ్యౌషధం

పోరుమామిళ్ల, జూలై 28 : స్వచ్ఛమైన గాలి శరీరానికి దివ్య ఔషధంలాంటిదని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాణాయామాలు ధ్యానంతో వత్తిడిని అధిగమించే శిక్షణ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలిని లయబద్ధంగా మానవాళి పీల్చడం, రవిశంకర్ గురూజీ అందించిన సుదర్శనక్రియ రోజూ సాధన చేస్తే శరీరాన్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు కమల, సాయికిరణ్, బిందు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



కొండాపురం, జూలై 28: మండలంలోని బి.కొట్టాలపల్లె గ్రామంలో వర్షం కోసం ఆదివారం గ్రామస్తులు పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని గంగమ్మ, పెద్దమ్మ, పోతులయ్య దేవుళ్లకు బోనాలు సమర్పించారు. అదును దాటుతున్నా వర్షాలు కురవక పోవడంతో బోనాలు, జంతుబలులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా చిన్నపిల్లల పీర్ల పండుగ



పోరుమామిళ్ల, జూలై 28 : చిన్నపిల్లలు పీర్లను ఊరేగిస్తూ పండగ వాతావరణం కల్పించారు. ఆదివారం పోరుమామిళ్లలోని ఉద్దికట్టవీధికి చెందిన చిన్నారులు పీర్లను ఎత్తుకుని డ్రమ్ములు వాయిస్తూ పోరుమామిళ్లలోని అన్ని పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. చిన్నపిల్లలు డ్రమ్స్ కొడుతూ పీర్లను ఊరేగించడం ప్రజలను ఎంతో ఆకట్టుకుంది.

పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరు జడ్పీహైస్కూల్ టెన్త్ 1990-91 బ్యాచ్ కు చెందిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొండాపురం, జూలై 28: మండలంలోని తాళ్లప్రొద్దుటూరు జడ్పీ హైస్కూల్‌లో 1990-91 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. సుగుమంచిపల్లె ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ సమ్మేళనానికి ఆనాటి విద్యార్థులు హాజరై తమ మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.ఆనాటి గురువులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు రామలింగారెడ్డి, చంద్రశేఖరెడ్డి, జయలక్ష్మి ,పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరుకున్న నిరసన

ముద్దనూరు జూలై28:మండల పరిధి పెద్దదుద్యాల గ్రామ సమీపంలోని జీఎం ఎకో కెమికల్ ఫ్యాక్టరీ వద్ద పెద్దదుద్యాల గ్రామ ప్రజలు చేపడుతున్న నిరసన కార్యక్రమాలు ఆదివారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి.గ్రామస్థులకు యువత సంఘీభావం తెలిపారు. ఫ్యాక్టరీ మూత వేసేంతవరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. బ్రహ్మానాయుడు, కాశీవరప్రసాద్, ఉదయ్‌కిరణ్, వరదక్రిష్ణ, హర్షవర్ధన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి భార్గవి

మైలవరం, జూలై 28 : మండల పరిధిలో కొనఅనంతపురం (సుగాలితాండ), మైలవరం గ్రామాల్లో మండల న్యాయ సేవా సంస్థ, జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి భార్గవి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని జమ్మలమడుగు బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఉచిత వైద్య శిబిరానికి చుట్టు పక్క గ్రామాల నుంచి వచ్చిన రోగులకు, చిన్న పిల్లలకు డాక్టర్లు డీఎంహెచ్‌ఓ శివ ప్రసాద్‌రెడ్డి, లిఖిత, హస్సేని, ఫణిత్‌కుమార్, జనార్ధన్‌రెడ్డి, మనోజ్‌కుమార్ వైద్య చికిత్సలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు రూపేష్, ఎస్ఐలు, బార్ అసోసియేషన్ సభ్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారా విద్యను సాధించుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం జూలై 28 : పోరాటాల ద్వారానే విద్యను సాధించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శివశంకర్ అన్నారు. ఆదివారం పెన్నానగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పి.సుబ్బరాయుడు పాల్గొని మాట్లాడారు అనంతరం అక్కడే జరిగిన ఎన్నికల్లో 13 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

గోపవరం, జూలై 28 : తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఉదయం ప్రజావేదిక, ప్రజాసమస్యల పరిష్కారం కార్యక్రమం ఉంటుందని వ్యవసాయ సంచాలకుడు మర్రిపాటి నాగరాజు ఆదివారం తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ప్రజావేదిక జరుగుతుందని ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ఉంటుందని ప్రజలు నేరుగా కలెక్టరుకు ఫోను చేసి వారి సమస్యలు తెలపవచ్చన్నారు. కాగా 08562 - 244437 ఫోన్ చేసి సమస్యలు తెలపవచ్చన్నారు. స్థానిక అధికారులు, ఉన్నతాధికారులు అందుబాటులోకి వచ్చి సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు చేపడతామని వారు తెలిపారు.

పింఛన్ లబ్ధిదారులపై విచారణ

చాపాడు, జూలై 28: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న పింఛన్‌దారులపై విచారణ చేస్తున్నట్లు ఎంపీడీవో రంతులయ్య పేర్కొన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నామన్నారు. మండలంలో మొత్తం పింఛన్ లబ్ధిదారులు 6,166 మంది ఉన్నట్లు చెప్పారు. వీరిలో అభయహస్తం 160 మంది, సీకేడీయూ నలుగురు, డప్పువాయిద్య కళాకారులు 133 మంది, వికలాంగులు 927 మంది, వృద్ధాప్య పింఛన్‌దారులు 3,534 మంది, ఒంటరి మహిళలు 90 మంది, చర్మ కళాకారులు ఆరుగురు, చేనేత కార్మికులు 29 మంది, వితంతువులు 1226 మంది, ఇతరులు 57 మంది ఉన్నట్లు చెప్పారు. వీరి అర్హతకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లను గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా విచారణ చేయిస్తున్నామన్నారు. దొంగ వికలాంగ సర్టిఫికెట్లపై విచారణ చేస్తున్నామన్నారు. నెల రోజుల్లోగా విచారణ పూర్తి చేసి నివేదికను కలెక్టర్, పీడీకి పంపుతున్నట్లు చెప్పారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి



జమ్మలమడుగులో ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

జమ్మలమడుగు, జూలై 28: సమాజంలో ప్రతి ఒక్కరూ సమస్యలు ఉన్నప్పటికీ ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శాంతికళ సూచించారు. ఆదివారం జమ్మలమడుగు పట్టణంలో ప్రపంచ హెపటైటిస్ డే పురస్కరించుకుని ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం యూపీహెచ్‌సీ కన్నెలూరి వారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆశావర్కర్లు, ఏఎన్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మించిన సంపద లేదు

ప్రొద్దుటూరు , జూలై 28 : ఆరోగ్యానికి మించిన సంపదలేదని ప్రతి ఒక్కరూ తినే ఆహారం పట్ల జాగరూకతతో వ్యవహరించాలని మండల వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ బాబా పేర్కొన్నారు. ఆదివారం వాసవి సర్కిల్ నుంచి వరల్డ్ హెపటైటీస్ డేసందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు బైపాస్ రోడ్డులోని దోబీ ఘాట్, ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వరప్రసాద్ ఆప్తాలమిక్ ఆఫీసర్ తేజ, టీబీ సూపర్‌వైజర్ హుస్సేన్‌బాషా, హెల్త్ అసిస్టెంట్లు సుబ్బయ్య, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


మంత్రి ఎంఎన్‌డీ ఫరూక్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 28: రాష్ట్రంలో కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు గోమేదికం సుదర్శన్ పేర్కొన్నారు. ఆదివారం నంద్యాలలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎంఎన్‌డీ ఫరూక్‌కు ప్రొద్దుటూరు ఎలక్ట్రీషియన్ వెల్పేర్ అసోసియేషన్ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ వైసీపీ పాలనలో కార్మికులకు ఎటువంటి ప్రయోజనాలు లేకుండా చేసిందని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున బోర్డును పునరుద్ధరించి కార్మికుల సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి ఆంజనేయులు, నంద్యాల ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఫీ, దస్తగిరి, సమర, తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ నూతన కమిటీ సమావేశం

పోరుమామిళ్ల, జూలై 28 : స్థానిక గ్రంథాలయంలో ఆదివారం మండల వార్షికోత్సవాల నిర్వహణలో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చాలా మంది సీనియర్ నాయకులను ఎన్నుకోవడం, వారు పూర్వం చేసిన కార్యక్రమాలను కొనియాడారు. అందరి ఉమ్మడి బాధ్యతగా నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు పోలంకి శ్రీరాములు పాల్గొన్నారు.

ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 28: ఆరోగ్యంపట్ల ప్రజలు శ్రద్ధ వహించాలని డాక్టర్ సాధిక్‌బాష పేర్కొన్నారు. తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో వరల్డ్ హెల్త్ డెవలప్‌మెంట్ అండ్ హ్యూమన్‌రైట్స్ ఫోరం కల్యాణ మండపం ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యానికి ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, పాలు తీసుకోవాలన్నారు. శరీరానికి తగిన వ్యాయామం ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా 300 మందికి ఉచితంగా వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ కల్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, మన ప్రజాసేవా సమితి అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, ఆదరణ సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, స్నేహ సేవా సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రోగులకు చికిత్స చేస్తున్న దృశ్యం

మురుగు కాలువల్లో పూడికతీత పనులు

ప్రొద్దుటూరు , జూలై 28 : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని 23 ,24 వార్డులలో వున్న ఖాదర్ హుస్సేన్ మసీదు వీధి, మౌలానా ఆజాద్ వీధులగుండా పారుతున్న మురుగుకాలువలో పూడిక తీత పనులను ప్రజా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మనుషులతో చేపడుతున్నారు. పదేళ్ల కాలంలో ఈ కాలువలో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో వర్షాలు వస్తే కాలువ పొంగిపొర్లి ఇళ్లలోకి నీరు చేరేది. ఈ కాలువలో పూడిక తీత చేపట్టాలని కొన్నేళ్లుగా మున్సిపల్ కౌన్సిల్‌లో కౌన్సిలర్లు డిమాండ్ చేస్తూనే వచ్చారు. గతంలో ఈ కాలువ పూడిక తీత పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ప్రధాన కారణం ఈ కాలువలో పూడిక తీయడానికి మిషన్లు లోపలికి వెళ్ళేంత విస్తీర్ణం లేవు. కాలువ ను ఆక్రమించి కట్టడాలు నిర్మించారు. అంతేకాకుండా కాలువ మీద అరుగులు కట్టారు. దీంతో కొన్నేళ్లుగా పూడిక తీత పనులు వాయిదా పడుతూ వచ్చాయి. ఎట్టకేలకు మిషన్లద్వారా కాకుండా మనుషులు దిగి కాలువలో పూడిక తీత పనులు చేపడుతున్నారు.అయితే మనుషులతో మురుగుకాలువను ఎత్తేయడం లాంటి పనులు ఎల్లప్పుడు సాధ్యం కాదు. కాబట్టి కాలువపై వున్న ఆక్రమణలు తొలగిస్తే కాలువను ఆధునికీకరించి అప్రోచ్ రోడ్డుసైతం నిర్మాణం చేస్తే ప్రతి ఏడాది మురుగు తొలగించే వీలు అవుతుంది. ఆదిశగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి

● ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

జమ్మలమడుగు, జూలై 28: ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియకుండా జీపీఎస్ గెజిట్ విడుదల చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిశ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జమ్మలమడుగు మండలంలోని గండికోట గ్రామంలో జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ గతవారం రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా ఆర్థికశాఖ ఉన్నతాధికారులు విడుదల చేసిన జీపీఎస్ గెజిట్‌ను ఉద్యోగ, ఉపాధ్యాయులు ముక్తకంఠంతో వ్యతిరేకించారన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశం గండికోటలో నిర్వహించడం జరిగిందని, ఉద్యోగ ఉపాధ్యాయుల 12వ పీఆర్‌సీలో సమస్యలను పరిష్కరించాలనివారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలవారు పాల్గొన్నారు.